


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

నేను నవ్వి, "ఇండియా ఇప్పుడు చాలా మారిపోయింది. ఎన్నో మధ్యతరగతి ఇళ్లలో ఇప్పుడు విస్కీ బాటిల్సు కామన్ ఐటమ్" అన్నాను. అది నిజమే కానీ, "అక్కడుండి మేమేం మిస్సవడం లేదుసుమా" అని నిరూపించాలనే సాధారణ ఇండియన్ తాపత్రయం నా మాటల్లో లేదనలేను.

తన ప్రాధాన్యం పలచబడిపోతుందనుకున్నాడేమో, చక్రవర్తి వెంటనే మాట మార్చి, జర్మనీలో ఇండియన్సుకి ఎదురయ్యే తిండి ఇబ్బందిని ప్రస్తావించాడు.

అది రామచంద్ర ఫావరేట్ సబ్జక్టు. అతను వెంటనే, "ఇక్కడ మన సరుకులన్నీ దొరుకుతున్నాయి. చేసుకుందుకు సదుపాయాలు మన దేశంలోకంటే బాగున్నాయి" అంటూ వంట విషయమై తను చేసిన విషయసేకరణా, సాధించిన వంటకాలూ గురించి తన ఊపులో చెప్పాడు.

చక్రవర్తి వెంటనే, "అన్నీ అనుకుంటాం కానీ, మీ దక్షిణాదివాళ్లకి చింతపండు చాలా ముఖ్యం. అది మామూలు షాపుల్లో దొరకదు. హాంబుర్గ్‌లో ఒక ఇండియన్ అపరాల దుకాణముంది. ఇండియాలో అన్ని ప్రాంతాలవారికీ కావాల్సిన దినుసులన్నీ అక్కడ దొరుకుతాయి. ధరలూ చౌక. ఒకేసారి పెద్ద ఆర్డరిస్తే, పోస్టులో తెప్పించుకున్నా కూడా తక్కువే ఔతుంది. ఉదాహరణకి ఇక్కడ షాపుల్లో ఆవాలు 1.50. అక్కడ డెబ్బై ఫెనిగ్సే" అన్నాడు.

అంతే, అప్పుడతన్ని మాలాంటి ఇండియన్‌లాగే ఫీలయ్యాం. ముందు రామచంద్రనీ, ఆవెంటనే మిగతా మా ఇద్దర్నీ ఆకర్షించింది ఈ సమాచారం. చక్రవర్తి మా ముగ్గురికీ ఆ షాపు చిరునామా, ధరల పట్టిక ఉన్న జిరాక్సు కాపీలు తలొకటీ ఇచ్చాడు. తర్వాత ఆ కాపీ – చక్రవర్తి మాకు కలకాలం గుర్తుండిపోయేటంతలా ఉపయోగపడింది.

ల్యూనబర్గ్‌లో పరిచయమైన మరపురాని వ్యక్తిత్వాలు మరెన్నో ఉన్నాయి. అవి స్వానుభవాల వివరణలో సందర్భానుసారంగా పరిచయమౌతాయి.

కొత్త ప్రదేశంలో ఉన్నప్పుడు కొన్ని చూసి తెలుసుకోవాలి. కొన్ని అడిగి తెలుసుకోవాలి. ఐనా కూడా అర్థం చేసుకుందుకు ఒకోసారి చాలా చిన్న విషయాల్లో కూడా స్వానుభవమే తప్పనిసరి ఔతుంది.

'తల మాసిన, నొలు మాసిన, వలువలు మాసినను — ప్రాణవల్లభునైనన్ కులకాంతలైన రోతురు' అన్నాడు సుమతీ శతకకర్త. ఆ రోతకు గురి కాకుండా నన్ను నేను కాపాడుకుందుకు స్వదేశంలో సులభమైన మార్గాలు చాలా ఉన్నాయి.

జర్మనీలో ఐతే నా పక్కన కులకాంత ఎలాగూ లేదు. చుట్టూ ఉన్నవారిలో బిశ్వాస్‌వంటి వారే ఎక్కువ. ఇక్కడ ఏం మాసినా నన్ను రోసేవారు లేరు. ఐనా అన్నేళ్లుగా వంటబట్టిన అలవాట్లు – నాపై ఏం మాసినా నన్ను నేనే రోసేలా చేసే ప్రమాదముంది. ఆ ప్రమాదంనుంచి తప్పించుకుందుకు నా ప్రయత్నాలు నేను చెయ్యాలి కదా, వాటిలో కొన్నింటినిక్కడ అదే వరుసలో చిత్తగిస్తాను.

### రోసేవారెవరురా నను వినా

ఇండియాలో – తల దాకా ఎందుకు, చెంపలు మాస్తే చాలు – క్షౌరశాలకి స్ప్రింట్ చెయ్యాల్సిందే నేను! సాధారణంగా క్షౌరానికీ క్షౌరానికీ మధ్య వ్యవధి రెండు వారాలు దాటేది కాదు. దాటితే ప్రపంచమంతా నన్ను చూసి రోత పడుతున్న ఏదో ఫీలింగ్.

జర్మనీ వచ్చి రెండు వారాలు కాగానే నా తలలో దురద మొదలైంది. క్షౌరశాల గురించి వాకబు చేస్తే – కటింగుకి ఐదు మార్కులని తెలిసింది. అప్పటికి భువనేశ్వర్లో క్షౌరానికి ముప్పావలా కాబోలు తీసుకుంటున్నారు. ధరల్ని పోల్చితే ఎలాగూ షాకే. ఐదు మార్కులే కదా అని సరిపెట్టుకుంటే, ఇది ఒకసారితో ఐపోయేది కాదు. ఈ ప్రపంచంలో ధరలకంటే వేగంగా పెరిగేది, తలమీద కత్తిరించిన జుత్తు ఒక్కటేనని నేనే అనేవాణ్ణి. ఏంచెయ్యాలా అని మనసులో మథన మొదలైంది. అప్పుడు నా మనసు రెండుగా విడిపోయింది.

'లాంగ్వేజి కోర్సు నాలుగు నెలలు. అంటే నాలుగు – రెండు వారాలు. రెండు వారాల కొకసారి ఐదు మార్కుల చొప్పున, తలమాపును మాఫీ చెయ్యడానికి ల్యూనబర్గులోనే మొత్తం ఇరవై మార్కులు క్షవరం ఐపోతాయి. ఆపైన బెర్లిన్ వెళ్లి పన్నెండు నెలలుండాలి. అంటే ఇరవైనాలుగు నెలలు. అంటే క్షౌరానికి నూటిరవై మార్కులు. అదీ అక్కడకూడా క్షౌరం ధర ఐదు మార్కులే ఐతే. ఇంత డబ్బుని క్షౌరం చేస్తానంటే నేనొప్పుకోను'' అంది ఓ మనసు.

''ఇక్కడికొచ్చిన రెండు వారాల్లోగానే రేడియో–రికార్డరు కొనడానికి మూడొందలపాతిక మార్కులు ఖర్చు పెట్టావు. పదహారు నెలలకి నూట నలభై మార్కులౌతాయని, ఇక్కడున్నన్నాళ్లూ తలమాసినవాడిగా ఉండిపోతావా?'' అని మందలించింది రెండో మనసు.

''ఐతే నీకు కుబేరుడి కథ చెప్పాలి. కురుక్షేత్ర యుద్ధానంతరం హస్తినలో వానలు పడక తిండికి కరువొచ్చింది. సాయంకోసం ధర్మరాజు భీముణ్ణి కుబేరుడి వద్దకు పంపాడు. ఆ సమయానికి కుబేరుడు అక్కడక్కడ నేలమీదపడ్డ ధాన్యం గింజల్ని ఏరి కుప్పలో వేస్తున్నాడు. 'ఇంత పిసినిగొట్టు మాకేం సాయపడతాడూ' అని సందేహిస్తూనే భీముడు కుబేరుడికి తనొచ్చిన పని చెప్పాడు. కుబేరుడు వెంటనే వెయ్యి బళ్లని ధాన్యం బస్తాలతో నింపి అతడికిచ్చి తోడుగా తనూ బయల్దేరాడు. కానీ దారిలో ఓ చోట ఏరుపొంగి బాటంతా జలమయమై మూసుకు పోయింది. కుబేరుడు వెంటనే ఐదొందల బళ్లమీది బస్తాల్ని నీళ్లలో వేయించి బాట ఏర్పరిచాడు. మిగతా ఐదొందల బళ్లనీ ఆ బాటలో తీసుకెళ్లమనీ, తనింకో ఐదొందల బళ్లు పంపిస్తాననీ అన్నాడు. అప్పుడు అక్కడక్కడ నేలమీద పడ్డ గింజలకోసం కక్కుర్తి పడ్డవాడు, ఇప్పుడు బస్తాలకు బస్తాల ధాన్యాన్ని నీళ్లపాలు చెయ్యడం భీముడికి ఆశ్చర్యం కలిగించింది. 'ఉత్తప్పుడు గింజ కూడా వృథా చెయ్యకూడదు. అవసరమైనప్పుడు మొత్తం సంపదని వెచ్చించడానికి వెనకాడకూడదు' అని కుబేరుడు భీముడికి ఓ గొప్ప ఆర్థికసూత్రం వివరించాడు. కాబట్టి నువ్విప్పుడు అనుసరించాల్సింది కుబేరుణ్ణి'' అంది మొదటి మనసు.

''చిన్న క్షౌరం కోసం ఇంత పెద్ద కథా! అదీ నిన్ను తల మాసినవాణ్ణి చెయ్యడానికి. తల మాస్తే ఏమౌతుందో సుమతీ శతకంలో ఉంది. గుర్తు చేసుకో. ఇక నేను చెప్పేదేం లేదు'' అని మాయమైపోయింది రెండో మనసు.

''గుర్తు చేసుకో. రోసేవాళ్లుంటేనే తల మాయకూడదని దానర్థం. తల మాస్తే ఇక్కడ నిన్ను రోసేవాళ్లెవరున్నారు? ఆలోచించుకో – బోలెడన్ని మార్కులు ఆదా నీకు'' అని మొదటి మనసూ మయమైంది.

ఇంతవరకూ నాకోసం మనసులు ఆలోచించిపెట్టాయి. ఇక నావంతొచ్చింది. ఆలోచిస్తే, నా పరిసరాల్లో మగాళ్లలో చాలామంది పొడుగు జుట్టుతోనే ఉంటున్నారు. పొట్టి జుట్టుతో ఉన్నవాళ్లలో కూడా నన్ను రోసేవాళ్లు లేరు. అలా అనుకుని క్షౌరాన్ని వాయిదా వేశాను. ఈలోగా మావాళ్లలో నటరాజన్ఓసారి క్షౌరం చేయించు కున్నాడు. ''అన్నీ ఆటోమేటిక్మెషీన్లు. ఆపరేషన్బల్లమీద కూర్చున్నట్లుంది'' అన్నాడతను.

అలా పొడుగు జుట్టుతో ఎవరూ రోయకుండా మూణ్ణెల్ల పైన గడిపేక, సెప్టెంబర్ 11న వెళ్లాను క్షౌరానికి. ఆశ్చర్యమేమిటంటే క్షౌరశాల బిజీగా ఉంది. నేను వెళ్లేసరికి ముగ్గురక్కడ వెయిటింగ్. అందరివీ పొడుగుజుట్లే. క్షౌరమయ్యేక కూడా అవి పొట్టిగా మారినట్లు నాకు తోచలేదు. ఎలా వెళ్లినవాళ్లు అలా వస్తున్నారనిపించింది. అందుకు ఐదు మార్కులా అని మళ్లీ మథనపడ్డాను కానీ, వెనకడుగు మాత్రం వెయ్యలేదు.

వ్యవహారానికి మాకిచ్చిన ఓ పుస్తకంలో జర్మన్లో ఎక్కడ ఏం చెప్పాలో సూచనలున్నాయి. క్షౌరశాలలో 'ఎట్వాస్ కుర్జర్' (ఓ మోస్తరు పొట్టిగా) అనే పదం మననం చేసుకున్నాను.

జర్మన్ మంగలికి స్పీడెక్కువే. నలభై నిముషాల్లో ముగ్గురికి క్షౌరం చేశాడు. నా వంతు రాగానే వెళ్లి కుర్చీలో కూర్చుని తల అప్పగించాను. నటరాజన్ అన్నట్లు ఆపరేషన్లా లేదు కానీ, ఇరవై నిముషాలు నా తలపై మెషీన్లూ, కత్తులూ, కత్తెరలూ కదలాడినా, అసలు క్షౌరం చేసినట్లు కూడా అనిపించక ఉసూరుమంది. ఇతరుల మనోభావాల్నిబట్టి జుట్టేమైనా తగ్గిందేమో తెలుసుకుందామంటే, అసలే ఇది ఎవరూ ఎవర్నీ పట్టించుకోని జర్మనీ! నాలో ఏదైనా మార్పొచ్చిందో లేదో ఎవరూ చెప్పరు.

అద్దంలో చూసుకుంటే, ఏదో మార్పొచ్చినట్లే ఉంది.

''ఔఫ్ వీడర్జెహెన్'' (మళ్లీ కలుద్దాం) అన్నాడు జర్మన్మంగలి.

''మళ్లీనా?'' అనుకున్నాను జేబులో పర్సు తడుముకుంటూ.

తల మాపు కథ అయిందిగా, ఇప్పుడు ఒలు మాపుకి వద్దాం.

**జలకాలాటలలో**

ఫ్రౌ యాకేల్ఇల్లు చిన్నదైనా ఏ సౌకర్యానికీ లోటు లేదు. ఆమె ఆత్మీయత కూడా నన్నాకట్టుకుంది. అక్కడ నాకున్న ఏకైక సమస్య స్నానం. బాత్రూంలో కమోడుంది. వాష్బేసినుంది. స్నానానికి సదుపాయం లేదు.

'ఒలు మాసిన ప్రాణవల్లభునైనన్ కులకాంతలైన రోతురు' అన్నాడు సుమతి బద్దెన. ఇది జర్మనీ, ఇక్కడ ఎవరూ ఎవర్నీ పట్టించుకోనవసరం లేదు – అని నా మనసొకటి అప్పటికే నాకు జ్ఞానబోధ చేసి ఉంది. కానీ నన్ను నేను పట్టించుకోవాలి కదా! తల మాపుని భరించినట్లు వంటి మాపుని భరించగల శక్తి నాకు లేదు. దానికి తోడు నా మిత్రులైన కొందరిళ్లలో స్నానానికి సదుపాయముంది. వాళ్ల అదృష్టానికి ఆసూయ పడుతూ, నా దురదృష్టానికి బాధపడేవాణ్ణి.

జర్మనీలో అన్ని ఇళ్లలోనూ స్నాన సదుపాయముండదు. చలి దేశం కావడంవల్ల స్నానం అక్కడ నిత్యావసరం కాదు. స్నానానికని ఊరికి బయటున్న స్నానశాలల గురించి కొంత సమాచారం సేకరించాను. అక్కడ యాభై ఫెన్నిగ్స్నుంచి ఒకటిన్నర మార్కులవరకూ మూల్యం చెల్లించాలి. నిజానికది పెద్ద మొత్తం కాదు. మేమైతే స్కాలర్షిప్ మీద వచ్చాం కాబట్టి అదో ఖర్చు అనుకుంటున్నాం కానీ, ఊరివారికైతే ఆ సదుపాయం బాగుంది. ఇంట్లో స్నానాలగది ఏర్పాటు చేస్తే మెయింటెనెన్సు ఖర్చవుతుందని, కొంతమంది గృహస్థులు వారానికో రెండువారాలకో ఒకసారి సకుటుంబంగా స్నానశాలలకెళ్లి స్నానాలు చేసి వచ్చేస్తూంటారు. అదే చౌక వారికి.

స్నానం విషయమై బాగా ఇబ్బందిపడ్డ ఇండియన్సుమి నేను, సుబ్రహ్మణ్యం, రామచంద్ర. మా ముగ్గురికీ ఇండియాలో రోజుకొక్కసారైనా స్నానం చేసే అలవాటుంది. అక్కడైతే స్నానం ఖర్చులేని పని.

ఇంతకీ జర్మనీ చలి దేశం. ఎంత చలి అంటే, గదిలో ఫ్రిజ్‌లేని కొందరు ఇండియన్స్ – పాలు, వెన్న వగైరా ప్యాకెట్లని గది కిటికీ బయట వ్రేలాడదీసేవారు. "ఇంట్లో ఫ్రిజ్‌కంటే ఈ బయటి ఫ్రిజ్ మోర్ ఎఫెక్టివ్. పైగా దీనికి కరెంటు ఖర్చు కూడా లేదు" అని సంబరపడేవారు.

బయట అంత చలిఉన్నా కూడా, స్నానం చెయ్యని రోజున ఏదోలాగుండేది. క్లాసులున్న రోజుల్లో గ్యోతే ఇన్స్టిట్యూట్లో స్నానం చెయ్యడానికి గదులున్నాయి. ఆ ఐదు రోజులూ ఒక్క రోజు కూడా విడవకుండా – క్లాసులవగానే పరుగున మేం ముగ్గురం స్నానాలగదులకు వెళ్లేవాళ్లం. నడిచి వెళ్లొచ్చు కదా అనుకోవచ్చు, మా పరుగుకు కారణాలున్నాయి. ఒకటి రద్దీ. మేమైతే స్నానం అవసరం ఫీలౌతున్నాం కానీ, ఫ్రీగా వస్తే ఎండ్రినైనా తాగే బాపతు కొందరుంటారు కదా! వాళ్లూ స్నానానికి ఎగబడేవారు. అందువల్ల ఉన్న గదులకంటే స్నానం చేసేవాళ్ల సంఖ్యే ఎక్కువగా ఉండేది. క్లాసు వదలగానే ఒలింపిక్స్‌లో ఈల విన్న స్ప్రింటర్సులా కదిలేవాళ్లం. ఒకోసారి మేము ముందు వెడితే, ఒకోసారి ఇంకెవరో ముందుండేవాళ్లు. వచ్చినవాళ్లు అప్పటికే ఉన్నవాళ్లని 'ఎండ్రిన్ బ్యాచ్' అన్నట్లు చూడ్డం మామూలు. ఆ విషయంలో మాతో సహా అందరూ గురివిందలే.

అక్కడ స్నానానికి కొన్ని నియమాలున్నాయి. స్నానం చేసేటప్పుడు వంటిమీద బట్టలుండకూడదు. తలుపులు మూసుంటే, అది ఇబ్బందే కాదు. కానీ ఇక్కడ స్నానాల గదులు ఒకదాని పక్క ఒకటి వరుసగా ఉంటాయి. వాటికి తలుపులుండవు. పల్చటి తెరలుంటాయి. లోపలి మనుషులు కనిపించరు కానీ, కావాలంటే ఎవరైనా తెర లాగి చూడొచ్చు. లోపల షవర్ సదుపాయముంది. ఒకటి వేణ్ణీళ్లకూ, ఒకటి చన్నీళ్లకూ రెండు వాల్వులున్నాయి. వాటి సాయంతో తగిన పాళ్లలో నీళ్లు తొరుపుకుని షవర్‌బాత్ చేయవచ్చు.

చాలామంది బాత్రూంలో పాటలు పాడేవారు. కొందరి గొంతులు భయంకరంగా ఉండేవి. ఆ విషయం వాళ్లకీ తెలుసు. ఐనా పాడేవారు. ఎందుకంటే లోపల మనిషున్న విషయం తెలియడానికి అదొక్కటే మార్గం. లేకుంటే ఎవరో ఒకరు తెర తొలగించి చూసే అవకాశముంది. అందుకు అభ్యంతరం లేనివాళ్లు పాడనవసరం లేదు. అలా పాడని వాళ్లలో శర్మ ఒకడు. పొరపాటున ఎవరైనా తెర తొలగిస్తే అతడు హాహాకారం కూడా చేసేవాడు కాదు. చిన్న స్మైల్ ఇచ్చేవాడు. ఆ సమయంలో ఆ చిరునవ్వు పాటకన్నా భయంకరం అనిపించేది. "మిగతావాళ్ల విషయమెలాగున్నా, శర్మ పాడి తీరాలి" అని అక్కడ కొందరు రిఫరెండం పెట్టి నిర్ణయించారు. దాన్ని శర్మ వీటో చేస్తూ "నా పాట నేను భరించలేను. నన్ను నేనే శిక్షించుకోవాలంటే నేనొప్పుకోను" అన్నాడు.

అక్కడి వాళ్లలో కొందరితో పోల్చితే పాటల విషయంలో నేను రఫీనో, ఘంటసాలనో అనుకోవచ్చు. ఐనా జనం వినేలా పాడ్డానికి నాకు మొహమాటం. అందుకని, ఎవరేమనుకున్నా సరేనని నేను మోకాలిదాకా వచ్చే చారల డ్రాయర్ ధరించి స్నానం చేసేవాణ్ణి. ఇంతకీ స్నానాలగదిలో తెరచాటున దిగంబరంగా కళ్లబడడం గురించి ఇలా నాలాంటి కొందరు మొహమాటపడితే, స్నానశాలలో గదుల బయటే దిగంబరంగా తిరిగేవారు కొందరు. ఇబ్బందికరమే ఐనా ఆ దృశ్యాలు భరించడం తప్పనిసరయ్యేది. ఇండియన్సులో మిగతావారిది తెరచాటు స్నానమే కానీ, ఒక్క శర్మ మాత్రం స్నానశాలలో ఏ సంకోచం లేకుండా దిగంబరంగా తిరిగేవాడు. పైగా ఉత్తరభారతంలో అది మామూలేనని చెప్పాడు. ఆ విషయంలో నేను సిగ్గుపడడం అతనికి ఆశ్చర్యంగా ఉండడం నాకు ఆశ్చర్యంగా ఉండేది.

స్నానంకోసం ఎదురుచూస్తూ ఊరికే నించోలేక జోక్సు చెప్పుకునేవాళ్లం. అస్తమానూ అది సాగేది కాదు. జర్మన్ భాషలోనే మాట్లాడాలని కొందరు జర్మన్ భాషాభిమానులు నొక్కించేవారు. అదే మాట క్లాసులో టీచర్లు కూడా చెప్పి ఉండడంవల్ల, సిన్సియారిటీకి మారుపేరైన కొందరు జపనీయులు వాళ్లకి మద్దతిచ్చేవారు. ఒకసారి అక్కడ ఒకే ఒక్క జర్మనూ, మిగతావాళ్లం ఇండియన్సుమీ ఉన్నాం. ఉన్న ఒక్క జర్మన్ పౌరుడూ మంచి దోసు మీదున్నాడు. అడుగు పడ్డంలేదు. మాట రావడం లేదు. ఆ ధైర్యంతో మేము ఇంగ్లీషులో విజృంభించాం. అంత నిషాలోనూ ఆ జర్మన్ పౌరుడు మమ్మల్ని, 'క్లైన్ఎంగ్లిష్, న్యూర్ డాయిచ్' (నో ఇంగ్లీష్, ఓన్లీ జర్మన్) అని మందలించాడు. 'నీ భాషాభిమానం మండిపోనూ' అనుకున్నాం.

స్నానాలకి వేణ్ణీళ్ల విషయంలో ఓ ఇబ్బంది ఉండేది. ముందుగా ఒకరిద్దరు స్నానం చేసేక, నీళ్లు వెచ్చబడ్డానికి కొంత సమయం పట్టేది. వెంటవెంటనే స్నానాలకి వెడితే, కొందరికి నీళ్లు చల్లగా ఉండేవి. ఆ చల్లదనం హిమాలయంలో గంగాస్నానానికి దీటొచ్చేది. అప్పుడు స్నానాల గదిలోంచి కెవ్వు–కేకలు వినిపించేవి. అందుకని ముందుగా స్నానం చెయ్యడానికి, తిరుపతిలో స్పెషల్ దర్శనానికిలా చాలా పోటీ ఉండేది. తిరుపతిలో వీఐపి దర్శనానికిలా, ఆ అవకాశం రోజుకి కొంతమంది అదృష్టవంతుల్నే వరించేది.

క్లాసులు లేని సెలవురోజుల్లో ఇన్‌స్టిట్యూట్లో స్నానం చేయడానికి అవకాశముండేదికాదు. అందువల్ల నేను శనాదివారాలు స్నానం చేసేవాణ్ణి కాదు. కానీ మొదటి లాంగ్వేజి కోర్సు అయ్యేక, రెండో కోర్సు మొదలయ్యేలోగా మధ్యలో కొన్ని రోజులు సెలవిచ్చారు. ఆ సెలవుల్లో మిగతా రోజుల్లోనూ ఇన్‌స్టిట్యూట్లో స్నానాని కవకాశం లేకుండా పోయింది. అందుకని నేను ఆగలేక ఓ శుక్రవారం ఫ్రయ్‌బాడ్ (ఓపెన్‌ఎయిర్ బాత్) సదుపాయం ఉన్నచోటకి వెళ్లాను. అది మా ఇంటికి చాలా దూరం. దానికి ప్రవేశ రుసుము అరవై పెన్నిగ్సు. వేణ్ణీళ్లకి ఆటోమేట్లున్నాయి. రెండు నిముషాలకి పది ఫెన్నిగ్సు వెయ్యాలి. నేను ఇరవై ఫెన్నిగ్సుతోనాలుగు నిముషాలు వేణ్ణీళ్ల స్నానం చేశాను. అక్కడ ఔట్‌డోర్ స్విమ్మింగ్‌పూల్ కూడా ఉంది కానీ నేనది చూసి ఆనందించడానికే పరిమితమయ్యాను. ఉన్నంతలో ఇది బాగానే ఉందని ఆ తర్వాత సోమవారం కూడా అక్కడికే స్నానానికి వెళ్లాను. ఆ పూట ఎందుకో ఆటోమాట్ పాడయింది. కానీ 'తాళము వేసితిని, గొళ్లెము మరచితిని' అన్నట్లు గీజర్ పని చేస్తూనే ఉంది. పది ఫెన్నిగ్సుకే బోలెడు సేపు స్నానం. తేరగా వచ్చిన వేణ్ణీళ్లు కాబట్టి, స్నానం మరింత బాగుంది.

ఫ్రయ్‌బాడ్ దూరమెక్కువ కాబట్టి పదేపదే అక్కడికి వెళ్లడం కష్టం. అందుకని నిత్య స్నానవ్రతులు సుబ్రహ్మణ్యం, రామచంద్ర నగరంలో ఉన్న కూర్పార్క్‌కి వెళ్లి డబ్బు కట్టి స్నానం చేసేవారు.

కూర్పార్క్ క్యూట్‌గా ఉంటుంది. అక్కడ చక్కని జలయంత్రాలున్నాయి. ఆకుపచ్చని పరుపు పరిచినట్లుండే పచ్చిక మైదానాలున్నాయి. ఆ పచ్చిక రమ్మని పిలుస్తుంటే, ఒక రోజున మేము వెళ్లి దానిమీద కూర్చున్నాం. ఆ పచ్చిక మెత్తగా హాయినిస్తే, మేము కబుర్లు చెప్పుకుంటున్నాం. అంతలో ఒక జర్మన్ వనిత మమ్మల్ని సమీపించింది. ఆమె మాట మెత్తగా లేదు. ఏవో సైగలు చేసింది. అవీ మెత్తగా లేవు.

''మర్యాద లేని మనిషి. తనని పట్టించుకోవద్దు'' అన్నాడు సుబ్రహ్మణ్యం. మేమామెవైపైనా చూడకుండా కబుర్లలో మునిగిపోయినట్లు నటించాం. కానీ మా ఆలోచనంతా ఆమెపైనే ఉంది. ఎందుకామె అలా ప్రవర్తిస్తోందన్నది మా కుతూహలం.

ఆమె స్వరం పెంచి ఏమేమో అని, చివరకు ఉన్నట్లుండి, ''పోలీచై'' అంది. ఉలిక్కిపడ్డాం.

జర్మన్లో పోలీచై అంటే పోలీసులని మాకు తెలుసు. మా విషయంలో ఆమె చాలా సీరియస్‌గా ఉందని అర్థమై చటుక్కున అక్కణ్ణించి లేచి బయటికొచ్చాం. వెంటనే ఆమె కూడా మరి మాట్లాడకుండా వెళ్లిపోయింది. ఆ వెంటనే మాకు తెలిసింది. పార్కులో పచ్చికమీద కూర్చోవడం పోలీసులు అరెస్టు చేసేటంత పెద్ద నేరమని!

చిన్నపిల్లలకి – బూచాడి పేరు చెప్పినట్లు ఆమె మమ్మల్ని పోలీసు పేరు చెప్పి బెదిరించడం తల్చుకుంటే నవ్వొచ్చింది. అంత పచ్చిక పెట్టుకుని కూర్చునేందుకు లేకుండా చేశారని పార్కువాళ్లని తిట్టుకుని, చుట్టూ చూస్తే – పార్కులో బోలెడు బెంచీలున్నాయి.

పాపం – తప్పు పార్కు వాళ్లది కాదు. తగిన ఏర్పాట్లు చేసేకనే పచ్చికపై నడవరాదన్న నిబంధన విధించారు.

పార్కు చాలా పెద్దది. లోపల ఆటస్థలాలున్నాయి. వ్యాయామశాలలున్నాయి. ఈ పార్కులోనే 'కూర్ జెంత్రం' అనే స్నానశాల ఉంది. ఆ స్నానశాల గదుల్లోనే ప్రతి శని, ఆదివారాలు రామచంద్ర, సుబ్రహ్మణ్యం స్నానాలు చేసేవారు. స్నానం చేసేముందు వంటిమీద బట్ట ఉంచుకోకూడదని ఇక్కడ ఖచ్చితమైన నిబంధన ఉంది. అది బోర్డుమీద కూడా వ్రాయబడి ఉంది. అందువల్ల నేను మొహమాటపడి అక్కడ స్నానానికి వెళ్లేవాణ్ణి కాదు. ఐనా కూడా – సుబ్రహ్మణ్యం, రామచంద్ర, నేనూ, మరికొందరు ఇండియన్సూ కూర్ జెంత్రంలో కలుసుకునేవాళ్లం.

వాళ్లు లోపలికెళ్లి స్నానం చేస్తూంటే మేము బయట బెంచీలమీద కూర్చునేవాళ్లం. మాకు ఎదురుగా ఓ ఇండోర్ స్విమ్మింగ్‌పూల్‌ఉంది. అందులో అలలు ఉవ్వెత్తున లేచి పడుతుండేవి. సముద్రస్నానం చేస్తున్న అనుభూతి ఇచ్చేటందుకు ఆ ఏర్పాటు చేయబడింది.

మగవాళ్లు చిన్ని డ్రాయర్లతోనూ, ఆడవాళ్లు బికినీలతోనూ అందులో స్నానం చేసేవారు. చాలామంది కుటుంబాలతో అక్కడ స్నానాలకొచ్చేవారు.

తండ్రిముందు వయసొచ్చిన కూతురు బికినీతో నిలబడి స్నానం చేయడం ఎబ్బెట్టుగా అనిపించింది నాకు. అప్పుడే నా ఆలోచనల్లో లోపించిన సంస్కారం స్ఫురించి నాపై నాకే కొంత చిరాకూ కలిగింది.

సెక్సు విషయంలో ఈ దేశానికీ మన దేశానికీ దృక్కోణాలు వేరు. మన మగాళ్లు ఆడది కనబడితే కళ్లప్పగించి చూస్తారు. వళ్లు కాస్త ఎక్కువ కనబడితే కళ్లు మరీ పెద్దవి చేస్తారు. సెక్సు నాలుగు గోడలకే పరిమితమంటూనే, బయట ఆడదాన్ని చూస్తే చాలు, మనసులోకొచ్చే సెక్సు భావనలు ఆపుకోలేరు. అందుకే పరాయి ఆడదానితో కరచాలనం చెయ్యాలన్నా, ఆమెను ముట్టుకోవాలన్నా, ప్రయాణంలో పక్కన కూర్చోవాలన్నా వాళ్లకి సంకోచం.

మరిక్కడి మగవారికి, బికినీతో ఎదురుగా నిలబడ్డ స్త్రీని కూడా నఖశిఖ పర్యంతం పరీక్షగా చూసే అలవాటు లేదు. అతి తక్కువ దుస్తుల్లో స్విమ్మింగ్‌పూల్లో ఈతలు కొడుతున్న వాళ్లు – చంటిపాపల్లా ఆడుకుంటున్నారు. అప్పుడు వాళ్ల మనసుల్లో స్త్రీపురుష భేదభావన ఉన్నట్లనిపించదు.

నా మనసులోని కాలుష్యం స్త్రీని స్త్రీగా చూస్తోంది. ఇక్కడి జనాలకు స్త్రీని స్త్రీగా చూడడానికి సమయాసమయాలు ఉన్నాయి. మన సమాజంలో అటువంటిదున్నట్లు తోచదు. నిండా పైట కప్పుకున్న స్త్రీ వైపు కూడా ఎన్నో కళ్లు ఆకలిగా చూడడం నాకు తెలుసు. ఆ ఆకలి అప్పుడప్పుడు నా కళ్లలోనూ జతపడేదేమో చెప్పలేను.

ఆలోచించగా ఆలోచించగా, సకుటుంబంగా స్విమ్మింగ్పూల్ స్నానాలు చేయగలగడం ఆశ్చర్యపోవలసిన విషయమే కానీ అసహ్యించుకోవలసినది కాదనిపించింది. ఏదిఏమైనా ప్రతి ఆదివారం కూర్ జెంత్రంలో కాస్సేపు స్విమ్మింగ్‌పూల్ వద్ద గడపడం మాకు మామూలైంది. అక్కడి దృశ్యాలు మమ్మల్ని అలరించాయన్నదీ నిజం.

ఒలు శుభ్రం విషయాన్నింతటితో ఆపి, ఇప్పుడు వలువల మాపుకొద్దాం.

### చాకిరేవు బాన ఏమంది?

జీన్సు బాగా వాడకంలో ఉన్న రోజులవి. అక్కడి మనుషుల్ని చూస్తే, నెలల తరబడి వాటితోనే పడుకుని, వాటితోనే లేచి, వాటితోనే తిరుగుతున్నట్లు అనిపించేది.

ఎంత చలి దేశమైనా శరీరానికి అంతో ఇంతో చెమట పడుతుంది. ఎంత సెంటు పూసినా అడపాతడపా బట్టలు మార్చుకోకతప్పదని నేననుకునేవాణ్ణి. మరి బట్టలు మార్చుకోవాలంటే ఎప్పటికప్పుడు ఉతుక్కోవాలి. ఇండియాలో పనిమనిషి ఉతికి పెడుతుంది. లేదా చాకలికి వేస్తాం. కానీ ఇక్కడ?

స్నానానికే ఇంట్లో గతి లేదు. ఇక బట్టలుతికేదెక్కడ? అప్పటికీ ఓసారి ఓ డిటర్జెంటు పౌడరు కొని లోదుస్తుల్ని బాత్రూంలో ఓ మగ్గులో నానబెట్టాను. ఆశ్చర్యమేమిటంటే, వాటిని వాష్‌బేసిన్లో నీళ్లతో కడగ్గానే, మట్టంతా విడిపోయి నీళ్లలోకొచ్చేసింది. అడ్వర్టయిజ్‌మెంట్లలో చూపించినట్లే బట్టలు తళతళ మెరిశాయి. వాటికంత మట్టి ఉందనీ, అది పోతే, అంత తళతళ మెరుస్తాయనీ నేనూహించలేదు. వాటిని రాత్రిళ్లే ఉతికి, రాత్రిళ్లే ఆరవేసుకుని హౌస్‌ఫ్రౌ కళ్లబడకుండా కొన్ని రోజులు మ్యానేజ్ చేశాను. లోదుస్తులు చిన్నవి కాబట్టి సరిపోయింది. మరి పాంటూ, షర్టూ ఏంచెయ్యాలి? ఎలా ఉతకాలి?

కొంత వాకబు చేశాను. బయట బట్టలుతకడానికి కేజీకి రెండు మార్కులు ఔతుందట. అలాగని ఓ కేజీ బట్టలిస్తే తీసుకోరు. కనీసం మూడు కేజీల బట్టలు ఇవ్వాలట. అంటే ఒకే ఒక బనీను ఇచ్చినా, మూడు కేజీల బట్టలు మూట కట్టిచ్చినా అయ్యేది ఆరు మార్కులే! ఒక్కరికైతే ఎక్కువే కానీ, ఒకరికి ముగ్గురైతే చౌకే అనిపించింది.

ఆ ప్రకారం ఒకరోజు నేను, బిశ్వాస్, నటరాజన్ – మా ముగ్గురివీ కొన్ని బట్టలు, మూడు కేజీల లోపు ఉండేలా చూసుకుని, ఓ లాండ్రీ షాపులో ఇచ్చాం. ఒకొక్కరు రెండు మార్కుల చొప్పున షేర్ చేసుకుందా మనుకున్నాం. అయితే బట్టలు తెచ్చుకోవడానికి వెళ్లేసరికి బిల్లు ఇరవైరెండు మార్కుల ఎనభై ఫెనిగ్స్ అయింది. అదేమని అడిగితే, తన దుకాణంలో బట్టబట్టకీ విడివిడిగా ఛార్జి చేస్తామనీ, కేజీల లెక్కన ఉతికే దుకాణాలు వేరనీ చెప్పాడు షాపువాడు. నావి ఒక పాంటు, షర్టు, రెండు బనియన్లు. షాపతని ఛార్జి ప్రకారం నా వాటా తొమ్మిది మార్కుల అయిదు ఫెనిగ్స్. నటరాజన్‌కైతే బొత్తిగా రెండే బనియన్లు. దానికే అతనికి మూడు మార్కుల ఇరవై ఫెనిగ్స్అయింది. బిల్లు అనుకున్నకంటే బాగా ఎక్కువవడంవల్ల, మేము ఖర్చు సమవాటాలు చెయ్యకుండా, బట్టల్నిబట్టి లెక్కేసి పంచుకున్నాం.

ఈ మా అనుభవాన్ని క్లాస్‌టీచరుకి చెప్పగా, "మీకీ శ్రమెందుకు? మీ హౌస్‌ఫ్రౌ మీ బట్టలు ఉతికి పెడుతుంది" అందామె. ఆ తర్వాత మేము బయట లాండ్రీ జోలికి వెళ్లలేదు.

యాకేల్ నా బట్టలుతికిపెట్టేది. ఇస్త్రీ కూడా చేసేది కానీ, చేతకాక మడతలు అడ్డదిడ్డంగా పెట్టేది. అయితే జర్మనీలో అదో సమస్య కాదు. ఇంచుమించు అంతా నలిగిన బట్టలతోనే తిరిగేవారు. జీన్సు అక్కడి ఫ్యాషన్. నలిగుండడమే కాదు, వాటికి చిరుగులూ, అతుకులూ కూడా ఉండేవి. చాలామందిని చూస్తే నెలల తరబడి బట్టలు మార్చనట్లు అనిపించేది. చాలామంది స్నానం కూడా అరుదుగానే చేసేవారు. శరీరంనుంచి వాసన రాకుండా ఉడుకులాం వాడేవారు. దేశంలో అపరిశుభ్రత అంటూ ఉంటే అది మనుషుల వంటిమీదనే ఉండేది.

**చిటపట చినుకులు**

'వాన రాకడ ప్రాణంపోకడ ఎవరికెరుక?' అంటారు మనవాళ్లు. అది పూర్వమెప్పుడో జర్మనీ వెళ్లి వచ్చినవాళ్ల అనుభవంలోంచి వచ్చిందని నాకిప్పుడర్థమైంది.

జర్మనీలో అడుగెట్టాక మొదటి శనివారమే సాయంత్రం అమ్‌శాండే దగ్గర తిరుగుతుండగా, ఏ సంకేతమూ లేకుండా ఉన్నట్లుండి వానొచ్చింది. సమయానికో షాపు నీడ దొరికి, తడవకుండా నన్ను నేను కాపాడుకోగలిగాను. పది నిముషాల్లో ఎలా వచ్చిందో అలా మాయమయింది వాన. అప్పుడు చూశానో మనోహర దృశ్యం.

కొందరు యువకులు గిటారు వగైరా సంగీతవాద్యాలతో పేవ్‌మెంటుమీదికొచ్చారు. వారు వీనులవిందుగా సంగీతం వినిపిస్తుంటే, ఫ్రాక్స్ వేసుకున్న కొందరమ్మాయిలు లయబద్ధంగా నృత్యం చేస్తున్నారు. టేక్‌స్‌కి బ్రేక్స్అవసరం లేని సినిమా షూటింగులా ఉంది ఆ దృశ్యం. వినోదించడానికి వచ్చిన జనం మధ్యమధ్యలో చప్పట్లు కొడుతున్నారు. వాన వెలిసినప్పుడు అలాంటి వేడుకలు అక్కడ మామూలని తర్వాత తెలిసింది.

తర్వాత నాకు అలాంటి దృశ్యం చూసే అవకాశం మళ్లీ రాలేదు కానీ, వానకు చిక్కిన సందర్భాలు చాలా ఉన్నాయి. అక్కడ తీవ్రమైన ఎండ – మనకి శీతాకాలంలో సాయంకాలపుటెండలా ఆహ్లాదకరంగా ఉండేది. అలాంటి ఎండలో తిరుగుతుండగా, ఉన్నట్లుండి ఆకాశంలో నల్లటి మబ్బులు మూసుకొచ్చేవి. భళ్ళున వాన కురిసేది. ఎంతసేపు, జస్టే మినిట్! వెంటనే వెలిసిపోయి, మబ్బులు మాయమై సాయంకాలపుటెండ తిరిగొచ్చేసేది.

ఈ వానల కోసమని మావాళ్లు చాలామంది గొడుగులు కొనుక్కున్నారు. ఇండియాలో ఉన్నప్పుడే నేను గొడుకు వాడడాన్ని నిరసించేవాణ్ణి – చేతికి అదనపు భారమని. హేండ్‌బ్యాగ్‌లోనో, లాంగ్‌కోట్ జేబులోనో ఇమిడిపోయేందుకు అనువుగా మడుచుకునే

గొడుగులిక్కడ దొరుకుతాయి. అయినా నేను గొడుగు కొనలేదు. గొడుగు లేదని వాన ఊరుకోదుగా, చాలాసార్లు వానలో తడిశాను. ఇండియాలో అయితే బాగా చలి వేస్తున్నప్పుడు బయట తిరిగితేనే జలుబు చేసేది. ఇక వానలో తడిస్తే చెప్పనే అక్కర్లేదు. కానీ ఇక్కడ నేను ఒక్కరోజైనా జిర్రున చీదలేదు. ధూళి దూసరాలు లేని పరిశుభ్ర వాతావరణం అందుకు కారణమేమో మరి!

## అసమదీయులు తసమదీయులు

ఇండియన్స్ అందరం వీలుని బట్టి తరచుగానే ఎక్కడో అక్కడ కలుసుకునేవాళ్లం. మాలో ప్రతిఒక్కరికీ ఎవరికి వారు సర్వజ్ఞులమన్న భావన ఉండేదేమో – మాటల్లో మన రాజకీయవాదులకి దీటొచ్చేవాళ్లం.

మాలో ప్రతిఒక్కరూ తమ హౌస్‌ఫ్రౌని – తమ పార్టీ మనిషిగా భావించి పొగుడుతుండేవారు. పొగిడినవాళ్లు పొగిడి ఊరుకున్నా, విన్నవాళ్లు విని ఊరుకున్నా ఏ గొడవా లేదు. ఉన్నట్లుండి హౌస్‌ఫ్రౌ మా పార్టీ అభ్యర్థిగా మారిపోయేది. వాళ్లమధ్య ఎన్నికల పోటీ జరుగుతున్నట్లుండేది. ప్రతి ఒక్కరూ తమ హౌస్‌ఫ్రౌ మిగతావాళ్ల హౌస్‌ఫ్రౌల కంటే గొప్పదనేవారు. సాక్ష్యాలతో వాదించేవారు.

రామచంద్ర హౌస్‌ఫ్రౌ అతని బట్టలుతికిపెట్టేది. అందుకు డబ్బు తీసుకునేది. నా హౌస్‌ఫ్రౌ నాకు ఉచితంగా బట్టలుతికి పెట్టేది. ఇద్దర్నీ పోల్చుతూ, "డబ్బు తీసుకుంటే మొహమాటముండదు. ఎన్ని బట్టలైనా వెయ్యడానికి సంకోచముండదు. డబ్బు తీసుకోలేదనుకో, ఉతకమని బట్టలివ్వడానికి మొహమాటపడతాం. అందువల్ల నా హౌస్‌ఫ్రౌ పద్ధతే మంచిది" అన్నాడు రామచంద్ర ఒకసారి.

అతను చెప్పింది కొంతవరకూ నిజమే. నేను మొహమాటపడి ఫ్రౌ యాకేల్‌కి ఉతకడానికి మాసిన బట్టలు ఇచ్చేవాణ్ణి కాదు. అయితే ఆమె, నేను లేనప్పుడు నా గదిలోంచి అవి తీసుకుని ఉతికేసేది. వాదనకోసం కాకపోయినా ఆ విషయం చెప్పడం న్యాయం. అదే అతనికి చెప్పాను.

సుబ్రహ్మణ్యానికి తన హౌస్‌ఫ్రౌ నచ్చలేదు. అతను తరచుగా నా హౌస్‌ఫ్రౌని మెచ్చుకునేవాడు.

ఏదిఏమైనా, నాకు తెలిసినంతలో అందరి హౌస్‌ఫ్రౌలూ అభిమానంగానే ఉండేవారు. వారిలో క్రంకెన్ గుప్తా, శర్మ, నటరాజన్ల హౌస్‌ఫ్రౌలు కాస్త ఎక్కువ మంచివారని నాకు అనిపించింది. అయితే అసమదీయుల విషయంలో నేనూ మిగతావారికి తీసిపోలేదు. ఫ్రౌ యాకేల్ని నేను అమ్మలా అభిమానించాను. ఆమె మంచితనానికి ప్రచారం కల్పించడం నా బాధ్యతగా భావించేవాణ్ణి. మిగతావారూ అలాగే అనుకోవచ్చు కదా, అందుకని ల్యానబర్గ్ వదిలేదాకా మా మధ్య హౌస్‌ఫ్రౌల గురించిన రాజకీయవాదాలు నడుస్తూనే ఉండేవి.

## ఫ్రౌ యాకేల్ ముచ్చట్లు

జర్మనీలో అడుగెట్టగానే – నాకు నిలువ నీడనిచ్చిన ఇంటి యజమానురాలు ఫ్రౌ యాకేల్. ఆమె పరిచయం నా అదృష్టం అనిపించేది.

రోజూ నన్నామె అభిమానంగా పలకరించేది. మద్యం ముట్టనని తెలియగానే ఆమెకు నాపై గౌరవాభిమానాలు పెరిగిపోయాయి. నన్ను తరచుగా తన వాటాలోకి ఆహ్వానించి టివి చూడమనేది. ఆమె ఇంట్లో కలర్ టీవీలో మంచి కార్యక్రమాలు కొన్ని చూసి ఎంజాయ్ చేశాను. ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం ఆమె నాకు తను ఇంట్లో చేసిన కేక్ పట్టుకొచ్చి ఇచ్చేది. అది చాలా బాగుందని మెచ్చుకుంటే ఆమె ముఖం ఇంతయ్యేది.

నిజానికి ఆ కేక్ నాకు నచ్చేది కాదు. తింటుంటే కోడిగుడ్డు సొన రుచి లీలామాత్రంగా తెలిసేది. అలాగని కోడిగుడ్డు నాకు మరీ కొత్తేం కాదు. రీసెర్చి రోజుల్లో డాక్టరు సలహామీద కొన్ని రోజులు పచ్చి కోడిగుడ్డుని పగులగొట్టి సొన తాగాల్సి వచ్చింది. కానీ ఆ సొన రుచి, వాసన కూడా భరించలేక – కోర్సు పూర్తి కాకుండానే ఆ వైద్యానికి స్వస్తి పలికాను. అప్పట్లో అలా ఆ రుచి నన్ను బాధించి ఉండకపోతే, ఇప్పుడు ఫ్రౌ యాకేల్ఇచ్చిన కేక్ ఎంజాయ్ చేసి ఉండేవాడినేమో తెలియదు.

యాకేల్ ఇంటిచుట్టూ చక్కటి తోట ఉంది. అందులో ఆపిల్, పియర్స్ వగైరా చెట్లున్నాయి. తన పెరటిచెట్ల పళ్లతో జామ్ తయారు చేసేదామె. అప్పుడప్పుడు ఓ సీసాడు జామ్ నాకిచ్చేది. అది చాలా రుచిగా ఉండేది.

అమె తరచుగా నన్ను క్షేమసమచారాలడిగేది. నాకు పెళ్లయిందనీ, ఇద్దరు పిల్లలనీ విని చాలా అశ్చర్యపడింది. తన కంటికి నేను పద్దెనిమిదేళ్ల కుర్రాడిలా కనపడుతున్నానంటే, చాలా ఆశ్చర్యపడ్డాను.

నిజానికి నాకు అప్పుడు ముప్పై నిండి ముప్పైఒకటి నడుస్తోంది. నేను కుర్రాడిలా కనబడతానని అక్కడ చాలామంది అనేవారు. ఐతే చిన్నవాళ్లలా కనిపించడం అందరికీ ఇష్టమే కానీ, అన్నివేళలా కాదు. ఒకసారి బట్టల షాపుకి వెడితే, అక్కడి సేల్స్‌గర్ల్ నా భుజం కొలత తీసుకుని కిండర్ సెక్షన్‌కి పొమ్మంది. ఒక అందమైన అమ్మాయలా అన్నందుకు కాస్త చిన్నబుచ్చుకున్నాను.

ఫ్రౌ యాకేల్ నా అసలు వయసడిగితే చెప్పడానికి మొహమాటపడి కాస్త తగ్గించి చెప్పాను. ఆమె నా ఫ్యామిలీఫోటో చూసి, నా భార్యాబిడ్డలు అద్భుత సౌందర్యంతో మిలమిల మెరిసిపోతున్నారంది. ప్రతీదీ అద్భుతం అనడం అక్కడివాళ్ల మర్యాదగా మాత్రమే భావించే వివేకం అప్పటికే అలవడింది కాబట్టి నేను మరీ మురిసిపోలేదు.

ఫ్రౌ యాకేల్లో నాకు బాగా నచ్చినది ఆమె సేవానిరతి. తనింట్లో హెర్(మిస్టర్) పాల్అని ఒక వృద్ధుడున్నాడు. ఆయన వయసు ఎనభైరెండు. ఆయన్ని ఆమె అంకుల్ పాల్ అని పిలుస్తుంది.

పాల్ ఆరోగ్యం బాగాలేదు. పట్టుమని నాలుగడుగులు వెయ్యలేడు. అతణ్ణి కంటికి రెప్పలా చూసుకుంటుంది యాకేల్. ఒక సందర్భంలో ఆమె నాకు తన కథ చెప్పింది.

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు ఫ్రౌ యాకేల్ పోలండ్‌లో ఉండేదిట. ఆమె, ఆమె భర్త అక్కడ ఎంతో హాయిగా జీవించేవారుట. రెండవ ప్రపంచయుద్ధం వచ్చిన తర్వాత 1945లో ఆమె డెన్మార్కుకి వెళ్లి మూడేళ్లుందిట. అక్కణ్ణించి కట్టుబట్టలు, చేతిలో ఒకేఒక పెట్టెతో, ఆమె కుటుంబం జర్మనీ చేరుకుందిట. నిరాశ్రయం, నిరాధారం అయిన ఆమె కుటుంబాన్ని అంకుల్ పాల్ చేరదీసి, ఆదరించి చేయూతనిచ్చాడుట. అలా నిలదొక్కుకున్నాక యాకేల్ భర్త క్రమంగా బాగా డబ్బు సంపాదించి 1958లో ఇప్పుడున్న ఈ ఇల్లు కట్టించాడుట. 1959నుంచి ఈ ఇంట్లో పై భాగాన్ని గ్యోతే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకి ఇస్తోందిట. మొట్టమొదట అద్దెకొచ్చిన ముగ్గురు ఆఫ్ఘన్లు బాగా గుర్తున్నారుట. ఆ తర్వాత గుర్తుంచుకోతగ్గ వ్యక్తిని నేనేనంది. అంకుల్ పాల్ వృద్ధుడై ఉన్నదంతా పోగొట్టుకుంటే, చూసేవాళ్లెవ్వరూ లేని ఆయన్ని యాకేల్చేరదీసిందిట. ఒకప్పుడు ఆదుకున్నాడన్న కృతజ్ఞతతో ఇప్పుడాయనకు సేవలు చేసుకుంటోందిట. భర్త ఎప్పుడు మరణించాడో చెప్పలేదు కానీ, ఒకరోజున నేను శ్రీమతికి ఉత్తరాలు వ్రాయడం చూసి, 19 ఏళ్ల వయసులో తనూ భర్తకు ఇలాగే ఉత్తరాలు వ్రాసేదాన్నని గుర్తు చేసుకుంది. ఆమెకు కూతురు, అల్లుడు, మనవడు ఉన్నప్పటికీ కూడా – 'పాల్మరణిస్తే నేను ఒంటరిని ఐపోతాను' అని బాధ పడుతూంటుంది. ఐతే ఆమె కృతజ్ఞతలో ఆత్మీయతకంటే బాధ్యత పాలే ఎక్కువా అన్న సందేహం నాలో కలిగే సంఘటన ఒకటి ఆ తర్వాత జరిగింది.

ఒకసారి ఫ్రౌ యాకేల్ ఏదో పనిమీద ఊరెడుతున్నానని నాకు చెప్పింది. తిరిగి రావడానికి నాలుగు రోజులు పడుతుందిట. పాల్ కోసం అన్ని ఏర్పాట్లూ చేశాననీ, ఐనా మధ్యమధ్య ఓసారి పలకరించి బాగోగులు తెలుసుకోమనీ కోరింది. సరేనన్నాను. ఆ తర్వాత శనివారం నేను సంతకి వెళ్లాను.

ల్యూనబర్గ్లో ప్రతి శనివారం సంత జరుగుతుందని రామచంద్ర నాకు చెప్పాడు. అక్కడ తాజా కూరలు, పళ్లు చౌకధరలకు దొరుకుతాయనీ, తను వారానికి సరిపడా అక్కణ్ణించే తెచ్చుకుంటాననీ, గుర్తుండిపోయేలా తన పద్ధతిలో పదేపదే చెప్పాడతను. ఆ రోజు సంత ఎలాగుంటుందో చూద్దామని వెడితే అక్కడ నాకు ఫ్రౌ యాకేల్ కనబడింది. అప్పుడే ఊర్నించి వస్తోందిట. ఇంకా ఇంటికెళ్లలేదు.

ఆమె ఏదో అడగబోతుంటే – అంకుల్ పాల్ బాగానే ఉన్నాడని చెప్పబోతూ మాటలకోసం తడుముకుంటుంటే – ఆమె చాలా ఆత్రుతగా తన కుక్క ఎలాగుందని అడిగింది. నేను బాగుందని చెప్పగానే, తనకది ప్రాణసమానమనీ ఎప్పుడో కానీ వదిలి వెళ్లననీ చెప్పింది. పాల్ గురించి అడగలేదు.

ఫ్రౌ యాకేల్ కూతురికి వివాహమై వేరెక్కడో ఉంటోంది. ల్యూనబర్గులోనే యాకేల్ సోదరుడు కూడా ఉంటున్నాడు. ఆమెకీ అతడికీ అంతగా పడదు. అతను అప్పుడప్పుడు వచ్చి సోదరిని పలకరించి వెడుతూంటాడు. ఒకసారి అతను వచ్చినప్పుడు ఆమె నన్ను పిలిచి అతనికి పరిచయంచేసింది. నా అలవాట్ల గురించి చాలా గొప్పగా చెప్పింది. నేను మాంసం, గుడ్లు, చేపలు వగైరాలేమీ తిననని తెలియగానే అతను కాస్త కంగారు పడ్డాడు. "మరేం తింటారు?" అన్నాడు చాలా కన్సర్న్‌తో

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments